# ప్రేమ పురాణం

-దీవి లక్ష్మిరాజేశ్వరి

మిట్టమధ్యాహ్నం. మండుటెండ. అబూదాబీనగరం భగ్నప్రేమికుని హృదయంలా మండిపోతోంది.

అమెరికన్ ఎయిర్ కండిషన్డ్ కారులో యజమాని సులేమాన్‌తో పాటు ఒక మీటింగ్‌కు వెళ్ళి వస్తున్నాడు సంజయ్.

సంజయ్ అబూదాబి వచ్చి అప్పుడే రెండు మాసాలయింది.

అతనికి ఈ ఉద్యోగం బాగా నచ్చింది. యజమాని సులేమాన్ చాలా మంచివాడు. వయసు యాభై ఏళ్ళుంటుంది. మంచి ఆరోగ్యం. పెద్దగా చదువుకోకపోయినప్పటికీ స్వంత తెలివితేటలవల్ల బాగా పైకి వచ్చినవాడు. సులేమాన్‌కి నాలుగయిదు పెట్రోలు కంపెనీల్లో వాటా వుంది. ఒక గ్యాస్ కంపెనీ అయితే పూర్తిగా అతని స్వంత ఆస్తి. నిజాయితీపరుడూ, బుద్ధిమంతుడూ, సమర్థుడూ అయిన పర్సనల్ సెక్రటరీ ఒకడు అవసరమై భారతదేశం వచ్చాడు సులేమాన్.

అదృష్టంకొద్దీ ఈ ఉద్యోగం సంజయ్‌కి వచ్చింది.

కారు సూడాన్ స్ట్రీట్‌లో వెళ్తోంది.

సులేమాన్ ఆదేశం మేరకు కారును సెంట్రల్ హాస్పిటల్‌కేసి పోనిచ్చాడు డ్రైవర్. మెదడు వ్యాధులకు సంబంధించిన వార్డు ముందుకు తీసుకువెళ్ళి ఆపాడు.

డ్రైవర్ దిగివచ్చి వెనుకవేపు డోరు తెరిచాడు.

తెల్లని ధవళ వస్త్రాల్లో ధగధగా మెరిసిపోతూన్న సులేమాన్ కిందికి దిగి చకచకా హాస్పిటల్‌లోకి నడిచాడు.

ఎండవేడిమిని తట్టుకోలేక డ్రైవర్ వచ్చి కారులో కూర్చున్నాడు. కారులోంచి అలా ఆసుపత్రి భవనాన్ని అలా తేరిపార చూడసాగాడు.

"బాస్ ఎందుకు ఎప్పుడూ ఈ హాస్పిటల్‌కి వస్తుంటారు?" ఉండబట్టలేక డ్రైవర్‌ని అడిగాడు సంజయ్.

"భార్యని చూడ్డానికి" క్లుప్తంగా వుంది డ్రైవర్ సమాధానం.

"ఆమె జబ్బుపడిందా?"

"కాదు-పిచ్చెక్కింది"

"పిచ్చెక్కిందా?...ఎలా?" ఆశ్చర్యంగా అడిగాడు సంజయ్.

"ఆ విషయం బాస్‌కీ, ఆ దేవుడికే తెలియాలి" నిర్లిప్తంగా సమాధానం చెప్పాడు డ్రైవర్.

"నువ్వు ఈ ఇంట్లో ఎప్పటినుంచో పనిచేస్తున్నావుగదా?"

"చిన్నప్పటి నుంచీ పనిచేయడం వరకే పరిమితం కావడంవల్లనే ఇంతకాలంగా ఇక్కడ పనిచేయగలుగుతున్నాను" సంజయ్ మాటలకు మధ్యలోనే అడ్డువచ్చి చెప్పాడు డ్రైవర్ దావూద్.

ఆ తర్వాత కొద్ది క్షణాలపాటు మాట్లాడలేదు.

"ఈ షేక్‌ల వ్యక్తిగత జీవితానికి మనం ఎంత ఎడంగా వుంటే అంత మంచిది. బావుంటే నెత్తికెత్తుకుంటారు, ఆకాశానికెత్తేసారు. చెడిందా నిలువునా పాతేస్తారు."

సంజయ్ ఇంగ్లీషు నవల చూడసాగాడు. దావూద్ మాటల్ని వినీవిననట్టు వూరుకున్నాడు.

సులేమాన్ డాక్టర్ ఆంథోనీతో కలిసి స్పెషల్ వార్డ్‌కెళ్ళాడు. ఆ వార్డు పూర్తిగా ధనవంతులైన షేక్‌ల సతీమణులకే పరిమితం. వార్డు సమీపించేకొద్దీ సులేమాన్ పాదాలు తెలియని భయంతో తడబడసాగాయి. గుండె వేగంగా కొట్టుకోవడం ప్రారంభించింది. మనసంతా వింత దిగులు, భయాలతో నిండిపోసాగింది. భార్యను చూడటానికి వచ్చిన ప్రతిసారీ అతని మానసిక స్థితి యిలానే వుంటుంది.

డాక్టర్ ఆంథోనీ వార్డు బయటే ఆగిపోయాడు. తలుపు తీయవలసిందిగా నర్సును చూపులతోనే ఆదేశించాడు.

తలుపులు తెరుచుకున్నాయి.

సులేమాన్ కనుబొమలు నీలుక్కుపోయాయి.

చెక్కిళ్ళు కంపించాయి.

ఒక పెద్ద ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు తనకుతాను సంసిద్ధం చేసుకుంటూన్నట్టు కనిపిస్తున్నాడు సులేమాన్.

నర్సు వెనక నడుస్తున్నాడు.

తన భార్యవున్న గదిలో అడుగుపెట్టాడు.

ఒక్కసారిగా ఒక వెర్రి వికటాట్టహాసం వినిపించింది.

ఠక్కున ఆగిపోయాడు సులేమాన్.

నిస్సహాయంగా తన ప్రేమపత్నికేసి చూశాడు.

ఆమె కళ్ళకింద నల్లని చారలు ఏర్పడ్డాయి. విషాదం ముఖంనిండా అలుముకుని వుంది. నల్లని వస్త్రాలు ధరించి మంచానికి దూరంగా గోడను ఆనుకుని కూచుని వుంది.

ఆమె నిజంగా ఒక నిలువెత్తు విషాదమూర్తి!

ఆమె ఒక పెద్ద నీళ్ళ గిన్నెలో తన ప్రతిబింబాన్ని చూసుకుని నవ్వుకుంటోంది.

ఓసారి జుట్టు సవరించుకుంటుంది. ఓసారి బుగ్గల్ని తడుముకుంటుంది. మరోసారి కళ్ళకు కాటుక పెట్టుకుంటున్నట్టుగా వేళ్ళతో అభినయిస్తుంది.

ఉన్నట్టుండి ఆమెకు గిన్నెలో సులేమాన్ రూపం కనిపించింది.

అంతే!

ఒక్కసారిగా ఆమె ముఖ కవళికలన్నీ మారిపోయాయి.

పిచ్చిగా ఒక్క గావుకేక పెట్టింది.

భద్రకాళిలా లేచి నిలబడింది. చేతిలోని గిన్నెను అతని ముఖానికేసి గిరాటు వేసింది.

రెప్పపాటులో తప్పించుకోగలిగాడు సులేమాన్. అయితే నీళ్ళతో అతని ముఖం బట్టలూ తడిచిపోయాయి.

సులేమాన్‌కి విపరీతమైన కోపం వచ్చింది. నిప్పులు చెరిగే ఆగ్రహంతో భార్యకేసి చూశాడు... అంతలోనే తిరిగి తనను తాను తమాయించుకున్నాడు.

"నువ్వు చాలా త్వరగా బాగవుతావని చెప్పారు డాక్టర్!" అన్నాడు.

"బాగయిపోతానా?" మండిపడిందామె. "ఎందుకు బాగయిపోతాను? వెళ్ళు. వెళ్ళిపో యిక్కడి నుంచి-నేను నిన్ను పెళ్ళిచేసుకోను-గడ్డానికి రంగు వేసుకున్నంత మాత్రాన పడుచుదనం వచ్చేసిందనుకున్నావా--ఒరేయి ముసిలి పీనుగా-నేను పిచ్చిదాన్ని అనుకుంటున్నావా?"

"కాదు. అసల ఎవరన్నారు నువ్వు పిచ్చిదానివని?" ఆమెను ప్రసన్నం చేసుకుందామనుకున్నాడు సులేమాన్.

"మరి...మరి ఎవరికి పిచ్చెక్కింది?" కోపంతో వూగిపోతూ అడిగింది.

"నాకు...నాకే పిచ్చెక్కింది" బెదిరిపోయాడు సులేమాన్.

"నువ్వు ఎలాగూ పిచ్చాడివే. అనుమానం ఏముంది? మాటిమాటికీ ఒంటెలాగా వచ్చిపడుతుంటావు, ముక్కు చిట్లిస్తూ! పెళ్ళికావాలట పెళ్ళి! నీ దగ్గర అసలు ఏముందిరా నాకు యివ్వటానికి!"

"చూడూ! నీ కోసం ఏం తెచ్చానో!" అంటూ సులేమాన్ ఖర్జూరం పళ్ళ ప్యాకెట్ తీసి ఆమె కందించాడు.

"ఖర్జూరాలా!" ఆనందంతో ఆమె కళ్ళు విప్పారినై. ఆమె ఎండిపోయి శుష్కమైన తన పెదవుల్ని నాలికతో తడుపుకుంది.

ఆమె ఆ ప్యాకెట్టును భద్రంగా దాచుకుంది.

ఆమె ముఖం మీద మళ్ళీ కోపం తాండవించసాగింది.

ఎవరైనా తీసుకుంటారన్నట్టుగా ఆమె ఖర్జూరాల పాకెట్‌ను మరీ మరీ భద్రంగా దాచుకోసాగింది. "ఉహూ ఉహూ నీకివ్వను నీ కివ్వను. వెళ్ళిపో యిక్కడినుంచి. చంపేస్తాను వెళ్ళకపోయావంటే!" అంటూ అయిష్టంగా





ఆమె తన భర్తకేసి చూసింది. పరిగెత్తు కెళ్ళి గోడకేసి తిరిగి నిలుచుంది.

మరోసారి నిస్సహాయంగా తన భార్యకేసి చూశాడు సులేమాన్. నర్స్ సంజ్ఞను గమనించి తక్షణం బయటికి అడుగుపెట్టాడు.

ఆమె వెనక్కి తిరిగి చూసింది.

గదిలో భర్త కనిపించక పోవడంతో సంతృప్తిగా గట్టి నిట్టూర్పు విడిచింది. ఆమె ముఖం నుంచి భయం తొలగిపోయింది. శుష్కించిన ఆమె పెద వులపై చిరునగవు వెల్లివిరిసింది. వెంటనే పాకెట్ విప్పింది. ఖర్జూరాలు గలగలా తినసాగింది. ఎవరైనా వచ్చి లాగేసుకుంటారన్నట్టుగా తినేస్తోందామె.

కారిడార్‌లో నడుస్తూండగా డాక్టర్ ఆంథోనీ కలిశాడు.

"మీ మిసెస్ ప్రవర్తనలో ఏమైనా మార్పు కనిపించిందా?" సులేమాన్ ముఖంలోని ఆందోళనను గమనించి అడిగాడు ఆంథోనీ.

"లేదు...!" నిర్లిప్తంగా సమాధానం చెప్పాడు సులేమాన్.

"మిమ్మల్ని చూసేప్పటికి వేరేవిధంగా రియాక్ట్ అయిందేమోగానీ ఆమెలో చాలా మార్పు వచ్చింది. మాతో ఎంతో హుందాగా వ్యవహరిస్తోంది"

"ఏదో మనశ్శాంతికి ఉపయోగపడతాయి డాక్టర్ యిలాంటి మాటలు" లోపలి బాధని బలవంతంగా దిగమింగుకుంటూ అన్నాడు సులేమాన్. ఒక్క క్షణం ఆగి, "డాక్టర్! ఈ జబ్బు ఎప్పటికి నయం అవుతుంది?" అని అడిగాడు.

"వైద్యం చేస్తున్నాం...ఈ కొత్త ఇంజెక్షన్స్ వల్ల త్వరగానే నయం కావచ్చని ఆశిస్తున్నాం"

"కేవలం ఆ ఆశను అట్టిపెట్టుకునే ఏళ్ళకి ఏళ్ళు గడపవలసి వచ్చింది. డాక్టర్! ఈమె శాశ్వతంగా ప్రశాంతంగా నిద్రపోవటానికి ఏదైనా యింజెక్షన్ యివ్వరాదా డాక్టర్!"

సులేమాన్ మాటలు విని ఆశ్చర్యంతో కొద్ది క్షణాలపాటు నోట మాట రాలేదు డాక్టర్ ఆంథోనీకి. ఆ తర్వాత ఆయన సులేమాన్ ముఖంలోకి గంభీరంగా చూశాడు.

సులేమాన్ ముఖం అప్పటికే రంగులు మారింది. "అవును డాక్టర్! అదే మంచిది-ఇలా బతకటంకన్నా చావు నయం కాదా?" గద్గద స్వరంతో పలికాడు సులేమాన్.

"చావు బతుకులు దేవుని చేతుల్లో ఉన్నాయి సులేమాన్, మన చేతుల్లో కాదు"

డాక్టర్ మాటలకు గాయపడిన సులేమాన్ హృదయం మూలిగింది. అతను నిర్లిప్తంగా డాక్టర్‌కేసి చూశాడు. మౌనంగా అడుగులు వేసుకుంటూ బయ టికి నడిచాడు.

డాక్టర్ ఆంథోనీ అలా శూన్యంలోకి చూస్తూ నిలబడిపోయాడు.

అక్కడ మృత్యువును పోలిన ఒక నిశ్శబ్దం అలుముకుంది.

* * *

కారు వేగంగా దూసుకుంటూ సులేమాన్ భవన ప్రాసాదంకేసి వెళ్తోంది. డ్రైవర్ దావూద్ మొత్తం తన దృష్టిని కేంద్రీకరించి కారుని వేగంగా డ్రైవ్ చేస్తున్నాడు. సంజయ్ తన యజమాని అయిన సులేమాన్‌కి రెండో వైపున కూర్చుని వున్నాడు. వీలుచిక్కినప్పుడల్లా సులేమాన్ ముఖ కవళికలను చదవ డానికి ప్రయత్నం చేస్తున్నాడు. రంగులు మారిపోతున్న యజమాని ముఖాన్ని పరిశీలనగా చూస్తున్నాడు. ఏదో పోగొట్టుకున్నవాడిలా వుండటాన్ని సంజయ్ గమనించాడు. హాస్పిటల్‌లోంచి వచ్చి, కారులో కూర్చున్నాక అతను డ్రైవర్‌తో ఒకే ఒక మాట అన్నాడు-"నన్ను త్వరగా ఇంటికి చేర్చాలి దావూద్! త్వరగా వెళ్ళాలి."

సంజయ్ తన యజమాని మానసిక స్థితిని అంచనావేస్తున్నాడు. చెమటతో తడిచిపోయిన అతని శరీరం ఎర్రబడిన కళ్ళు, రంగులు మారిపోతున్న అతని ముఖం సులేమాన్ మానసిక స్థితికి అద్దం పడుతున్నాయి.

జీవితం సులేమాన్‌ని మోసంచేయదుగదా!

సంజయ్ మెదడునిండా రకరకాల ఆలోచనలు...

మౌనంగా కూర్చున్నాడు సంజయ్.

సులేమాన్‌కి స్వస్థత చేకూరాలని వెయ్యి దేవుళ్ళని మొక్కుకున్నాడు.

కారు సులేమాన్ భవన ప్రాసాద ప్రాంగణంలోకి వచ్చేసింది. సంజయ్ సులేమాన్ స్థితిని గమనించాడు. అతని స్థితి బయలుదేరినప్పటికన్నా బాగా తీవ్రతరమయినట్టు కనిపించింది.

నౌకరు సికందర్ వచ్చి నమస్కారం పెట్టాడు.

కారులోంచి దిగటానికి ప్రయత్నిస్తూనే వాంతి చేసుకున్నాడు సులేమాన్. సంజయ్ అతనివేపుకి జరిగాడు. సంజయ్ ఒళ్ళోకి వాలిపోయాడు.

డ్రైవర్ వెంటనే దిగివచ్చి సికందర్ సాయంతో సులేమాన్‌ని ఎత్తుకున్నాడు. ముగ్గురూ కలిసి స్పృహతప్పిన సులేమాన్‌ని భద్రంగా బెడ్‌రూమ్‌లోకి తీసుకు వెళ్ళి బెడ్‌మీద పడుకోబెట్టారు.

సికందర్ వెంటనే సులేమాన్ కాలిజోళ్ళు తీసేశాడు.

సంజయ్ వెంటనే సులేమాన్ ఫ్యామిలీ డాక్టర్ భార్గవకి ఫోన్‌చేసి విషయం చెప్పాడు. సులేమాన్ మేనల్లుడు ఇమ్రాన్‌ని తక్షణం వెళ్ళి పిలుచుకు రమ్మని సికిందర్‌ని ఆదేశించాడు సంజయ్.

"ఇమ్రాన్ ఇంట్లో లేరు సార్!" అన్నాడు నౌకరు సికిందర్ తన యజమాని కాళ్ళు నొక్కుతూ.

"ఎక్కడికి వెళ్ళారు?"

"షార్జా-ఫ్యాక్టరీకి వెళ్ళారు."

"అయితే ఫ్యాక్టరీ నంబర్ కలుపు-నేను మాట్లాడతాను."

"ఇంకా ఆయన ఫ్యాక్టరీకి చేరుకుని వుండరు. ఇక్కడి నుంచి బయలుదేరి యింకా అరగంట కూడా కాలేదు."

"ఇంట్లో ఇంకెవరైనా వున్నారా?"

"లేరు"

"అయితే ఒక పనిచేయ్-" సులేమాన్ దుస్తులకేసి చూస్తూ అన్నాడు సంజయ్.

"చెప్పండి-"

"డాక్టర్ వచ్చేలోపల ఒక తడిగుడ్డ తీసుకుని ఆయన ముఖం, బట్టలూ శుభ్రం చేయ్."

## 'నగ్మా' అందాలే ఆకర్షణట?



10 కోట్ల రూపాయిల భారీ వ్యయంతో పూర్తిగా విదేశాలలో భారీ ఎత్తున రెబల్ హీరో శరత్‌కుమార్ నిర్మించిన 'రహస్య పోలీస్' చిత్రం దీపావళికి తమిళ నాడులో విడుదలై విజయవంతంగా నడుస్తోంది. ఇంతవరకు ఏ చిత్రంలోనూ చూపించని విధంగా నగ్మా అందాలను ఈ సినిమాలో పూర్తిగా ఎక్స్ పోజ్ చేశారంటున్నారు. నగ్మా అందాలే ప్రధాన ఆకర్షణైన ఈ చిత్రం తెలుగు డబ్బింగ్ రైట్స్ హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. డూప్‌తో పనిలేకుండా స్వయంగా నగ్మానే చేసిన ఫైట్స్ ఈ చిత్రానికే హైలెట్‌ట.

– భాషా

సికిందర్ బాత్‌రూమ్‌లోకి వెళ్ళి తడిపిన టవల్‌తో వచ్చాడు. డ్రైవర్ సాయంతో సులేమాన్ ముఖం, దుస్తులూ శుభ్రం చేశాడు.

సంజయ్ ఎయిర్ కండిషనర్ స్పీడు పెంచాడు. ఓసారి సులేమాన్ ముఖాన్ని పరికించి చూశాడు.

సులేమాన్ ముఖస్థితి సాధారణ స్థాయికి వస్తోంది. అయినా ఇంకా స్పృహ లేకుండాన పడివున్నాడు.

బెల్ మోగింది.

తలుపు తెరిచారు.

డాక్టర్ భార్గవ.

డ్రైవర్ ఆయన చేతిలోని బ్యాగ్ అందుకున్నాడు. డాక్టర్ లోపలికి అడుగుపెట్టాడు.

డ్రైవర్నీ, సికిందర్నీ కొద్దిసేపు బయటికి వెళ్ళమని చెప్పాడు సంజయ్.

వాళ్ళిద్దరూ బయటికి వెళ్ళిపోయారు.

సులేమాన్ స్థితిని గురించి సంక్షిప్తంగా వివరించి చెప్పాడు సంజయ్.

సంజయ్ సాయంతో డాక్టర్ భార్గవ సులేమాన్‌ని అటూ యిటూ తిప్పి చూశాడు–గుండె, బ్రెయిన్, నాడీ, బ్లడ్ ప్రెషర్ పరీక్షించాడు.

"ఇది గుండెపోటు కాదు" అన్నాడు డాక్టర్ భార్గవ, సంజయ్ అనుమానాన్ని నివృత్తి చేసేందుకు.

"మరి ఏమంటారు?" వెంటనే అడిగాడు సంజయ్.

"సన్‌స్ట్రోక్! ఎండ వేడిమికి మెదడు నరాలు ఎఫెక్ట్ అయ్యాయి. ఈయనని మీరు నేరుగా హాస్పిటల్‌కు తీసుకువస్తే మరీ బావుండేది" థర్మామీటర్‌ని పరీక్షిస్తూ అన్నాడు డాక్టర్ భార్గవ.

"మీరు మారుద్దామంటే వెంటనే అంబులెన్స్ తెప్పిస్తాను."

"వద్దు. ఇక్కడే వుండనీయండి. జ్వరం చాలా ఎక్కువగా వుంది. ప్రస్తుతం ఈయనకు పూర్తి విశ్రాంతి కావాలి" అంటూ డాక్టర్ భార్గవ బ్యాగ్ తెరిచి ఇంజెక్షన్ బాటిల్ బయటికి తీశాడు. సికిందర్‌ని ఐస్‌వాటర్ 'పట్టుకురమ్మని గట్టిగా కేకవేసి చెప్పాడు. సంజయ్‌కేసి తిరిగి మీరు ఎక్కడికి వెళ్ళారు?" అని అడిగాడు.

"ఒక ఫారిన్ బిజినెస్ ఏజెన్సీతో అపాయింట్‌మెంట్ వుండి వెళ్ళాం. అక్కడి నుంచి తిరిగివస్తూవ్వుడు సులేమాన్‌గారు సెంట్రల్ హాస్పిటల్‌లోకి వెళ్ళారు."

"ఓ, అలాగా! అయితే సులేమాన్ తన భార్యని కలిసి వచ్చారన్నమాట!"

"అవును!"

"అయితే ఈయన మెదడుమీద ఎండతోపాటు మానసిక ఒత్తిడి కూడా పనిచేసిందన్నమాట."

సికిందర్ ఐస్‌వాటర్ తీసుకువచ్చాడు.

డాక్టర్ చెప్పినట్టుగా నుదుటిమీద నీళ్ళలో తడిపిన గుడ్డతో పట్టీలు వేయ సాగాడు.



మందులు తెచ్చుకోవటానికిగాను తనతోపాటు డ్రైవర్‌ను రమ్మనిచెప్పాడు డాక్టర్ భార్గవ.

"జ్వరం ఎంత వుంది?"

సంజయ్ అడిగాడు.

"5.5"

"ఒకవేళ పెరిగితే?"

"అందుకే ఇంజెక్షన్ ఇచ్చాను. సికిందర్‌కిచ్చి మందు పంపిస్తాను. నేను పంపే మందుని గంటకి పది డ్రాప్స్ చొప్పన నోట్లోవేస్తూ వుండాలి. జ్వరం తగ్గిపోతుంది."

"కంగారు పడవలసింది ఏమీ లేదుగదా?"

"ఏం కంగారు పడనవసరం లేదు. హి యీజ్ అవుట్ ఆఫ్ డేంజర్!"

డాక్టర్ అక్కడి నుంచి బయలుదేరటానికి ముందు మరోసారి సులేమాన్ నాడిని పరీక్షించాడు. "ఒక అరగంట తర్వాత ఇక పట్టీలు వేయవద్దు" అని సికిందర్‌ని ఉద్దేశించి చెప్పాడు.

డాక్టర్ అక్కడినుంచి బయటికి నడిచాడు.

సంజయ్ డాక్టర్ భార్గవను అనుసరించాడు.

"ఇమ్రాన్‌కి వెంటనే కబురు పంపండి" అన్నాడు డాక్టర్ భార్గవ కారుడోరు తెరుస్తూ.

"ఆయన షార్జా వెళ్ళారు. ఇంకా ఫ్యాక్టరీకి చేరుకోలేదు."

"ఫ్యాక్టరీలో అతనికి మెసేజ్ పెట్టండి. అతను వచ్చే వరకూ మీరు సులేమాన్‌గారివద్దనే వుండండి. "

"తప్పకుండా ఉంటాను సార్!"

వెళ్ళిపోతూన్న డాక్టర్ భార్గవ కారుకేసి చూస్తూ కొద్దిసేపు అలాగే నిలబడిపోయాడు సంజయ్. డాక్టర్ భార్గవతో సంజయ్‌కి పూర్వ పరిచయం వుంది. ఒక విధంగా చెప్పాలంటే తనకు ఈ ఉద్యోగం యిప్పించింది డాక్టర్ భార్గవే. సులేమాన్ భార్య జబ్బుని గురించి డాక్టర్ భార్గవని అడిగి తెలుసుకుంటే పోయేదనిపించింది సంజయ్‌కి. కానీ అలా అడగటం బాగా వుండదని ఆ ప్రయత్నం నుంచి విరమించుకున్నాడు.

సంజయ్ తిరిగి బెడ్‌రూములోకి అడుగుపెట్టేసరికి సికిందర్ ఎంతో వద్దతిగా సులేమాన్ నుదుటిమీద తడిగుడ్డతో పట్టీవేస్తూ వున్నాడు. సంజయ్ షార్జాకి ఫోన్‌చేసి మెసేజ్ యిచ్చాడు. ఆ తర్వాత కోటు తీసేసి టైని వదులుచేశాడు. బెడ్ పక్కనే వున్న ఈజీ చైర్‌లో కూలబడి కాళ్ళు బార్లా జాపుకున్నాడు.

సికిందర్ మధ్యలో ఓసారి సంజయ్‌కేసి చూశాడు.

సంజయ్ బాగా అలిసిపోయిన వాడిలా కనిపించాడు.

"సర్! కాఫీ కలిపి యిమ్మంటారా?" సికిందర్ మెల్లిగా అన్నాడు.

"ఇప్పుడే వద్దు. ముందు నీ పని కానివ్వు" అంటూ కళ్ళు మూసుకున్నాడు సంజయ్.

ఎయిర్ కండిషనర్ నుంచి వస్తున్న చల్లని గాలి తెమ్మెరులకు అతనికి ఎంతో ప్రశాంతంగా వున్నట్టు అనిపించింది.

సులేమాన్‌కి స్వస్థత చేకూరాలని సంజయ్ హృదయం పదే పదే ప్రార్థిస్తోంది. ఎందుకంటే అతని భవిష్యత్తు మొత్తం సులేమాన్‌తో ముడిపడి వుంది.

– సశేషం

## సూపర్‌స్టార్ మేనరిజాలు



'నెంబర్ వన్' చిత్రంలో కృష్ణ చేత 'అదరహో' గెటప్స్ వేయించిన ఎస్.వి.కృష్ణారెడ్డి తాజాగా 'సంప్రదాయం' సినిమాలో సూపర్‌స్టార్ కోసం కొన్ని మేనరిజాలు సృష్టించాడు. ఒకే చేత్తో అగ్గిపెట్టెతో పుల్ల వెలిగించి చుట్టకాల్చే షాట్, ఒకే చేత్తో భుజాన వున్న కండువా తీసుకుని తలపాగా చుట్టుకునే దృశ్యాలు సూపర్‌గా వచ్చాయట!

ఈ చిత్రంలో 'గ్రే–డెన్' జాతికి చెందిన కృష్ణ పెంపుడు కుక్క పూర్తి నిడివిగల పాత్రలో నటిస్తోండటం ఓ స్పెషల్ ఎట్రాక్షనట.

– బాషా